క్లుప్తంగా

అక్కాతమ్ముడికి యూత్ ఐకాన్ అవార్డులు



అవార్డు అందుకుంటున్న ముకేశ్

పాల్వంచ: గణితంలో ప్రతిభ చాటిన పాల్వంచకు చెందిన అక్కాతమ్ముడు యూత్ ఐకాన్ అవార్డులు అందుకున్నారు. కరోనా సమయాన కోతగుండ్ల సాత్విక ముకుళాదేవి, హారెన్‌ముకేశ్ గణితంలో ఆన్‌లైన్ తరగతులకు హాజరై ప్రతిభ చాటారు. దీంతో తాజాగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారికి సుమన్ ఆర్ట్స్ అండ్ థియేటర్ సంస్థ బాధ్యులు మాజీ స్పీకర్ మధుసూదనాచారి చేతుల మీదుగా అవార్డులు అందజేశారు.

అవగాహన తప్పనిసరి

సుజాతనగర్: కుష్ఠువ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి డాక్టర్ బి.రమేష్ అన్నారు. కుష్ఠువ్యాధి నివారణ పక్షోత్సవాల్లో భాగంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో పాత అంజనాపురం గ్రామంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరికీ కుష్ఠువ్యాధిపై అవగాహన ఉండాలన్నారు. ప్రాథమిక దశలోనే వ్యాధి లక్షణాలను గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చని సూచించారు. శరీరంపై మొద్దుబారిన మచ్చలు ఉన్నట్లయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు.

బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా మధుచంద్‌పాల్

పాల్వంచ: బీసీ యువజన సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా పాత పాల్వంచకు చెందిన బత్తుల మధుచంద్‌పాల్ నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నుంచి నియామక పత్రం అందుకున్నారు. మంగళవారం మధు మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ సంఘం అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు రెడ్డిమళ్ల వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ముత్తయ్య, కొత్వాల సత్యంలకు ధన్యవాదాలు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

పాల్వంచరూరల్: దంతలబోరు ఎస్సీకాలనీ గ్రామపంచాయతీకి స్థానిక సర్పంచ్, ప్రజల వినతి మేరకు స్పందించిన కలెక్టర్ అనుదీప్ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.27లక్షలు మంజూరు చేశారు. మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ గద్దల రమేష్ భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ హచ్చ్యా, వీఆర్ఏ శ్రీను, జేటీయా, ఉపసర్పంచ్ వెంకటనర్సమ్మ, కోఆప్షన్ సభ్యుడు చిన్న ముత్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

టేకులపల్లి: విద్యుత్ వినియోగదారులపై అదనంగా భారం మోపిన ఏసీడీ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మంలోని ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి అన్నారు. ఈ మేరకు మంగళవారం బేతంపూడి సెంటర్‌లో ఇఫ్టూ ఆధ్వర్యంలో అక్రమ అరెస్టులను నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వెంకన్న, సామేలు, నాగేశ్వరరావు, లక్ష్మయ్య, లాలయ్య, కృష్ణ, పాపా,రామస్వామి, గోపా పాల్గొన్నారు.

కేసు నమోదు

జూలూరుపాడు: పంట పొలాలకు వెళ్లే దారి విషయంలో ఓ వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన ఐదుగురు దాడికి పాల్పడిన ఘటనపై స్థానిక పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ పోటు గణేష్ కథనం ప్రకారం.. సురారం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఏఎస్సై బానోత్ హత్తిరామ్‌జీతో అదే గ్రామానికి చెందిన హరిలాల్, పుల్లారావు, కొర్రా కీర్యా, కృష్ణ, నరసింహాలు పంట పొలాలకు వెళ్లే దారి విషయంలో గొడవపడ్డారు. ఈ క్రమంలో హత్తిరామ్‌జీపై కర్రలతో ఆ ఐదుగురు వ్యక్తులు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ కూడలి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. టేకులపల్లి మండలం బేతంపూడి గ్రామానికి చెందిన ఆజ్మీర సీతారాములు, కవిత ద్విచక్ర వాహనంపై డివైడర్ దాటుతుండగా బొగ్గు లారీ ఢీకొట్టింది. కవిత కాలు నుజ్జునుజ్జయింది. సీతారాములకు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు సిఫారసు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కలగానే పీసువాగు ప్రాజెక్టు

శిలాఫలకానికి 33 ఏళ్లు

- నిర్మాణం జరిగితే వెయ్యి ఎకరాల ఆయకట్టుకు సాగునీరు
- పునరుద్ధరించాలని రైతుల వినతి



మల్లారం వద్ద పీసువాగుపై ప్రాజెక్టు నిర్మాణం కోసం కట్ట పనులు చేసిన ప్రాంతం



(ఇన్‌సెట్) ప్రాజెక్టు శిలాఫలకం

పాల్వంచరూరల్: సాగునీటి సౌకర్యం లేక వర్షాధారంపై రైతులు పంటలు పండిస్తున్నారు. వర్షాలు కురిసి వాగులు, వంకలు పొంగి నీరంతా వృథాగా పోతోంది. ఈ మేరకు పీసువాగుపై ప్రాజెక్టు నిర్మించాలంటున్న స్థానిక రైతుల ఆవేదనను 33 ఏళ్లుగా ఎవరూ పట్టించుకోవడం లేదు. మండల పరిధి మల్లారం గ్రామశివారు అడవిలో గుట్టల నుంచి వచ్చే వరద నీరు పీసువాగు ద్వారా వృథాగా పోతున్నాయి. ఇక్కడ ప్రాజెక్టు నిర్మించి పంటలకు సాగునీరు అందించాలని 1989లో అప్పటి ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా రూ.34 లక్షలు మంజూరు చేసింది. ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు కూడా ప్రారంభించారు. కానీ ప్రాజెక్టు ప్రాంతం అటవీశాఖ పరిధిలో ఉంది. దీంతో ఫారెస్టు అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి అటవీశాఖ పరిధిలో ఉన్న 33 ఎకరాల భూమిని గుర్తించి మరో ప్రదేశంలో 33 ఎకరాలను అటవీ శాఖకు అప్పగించారు. కొంత ప్రాజెక్టు నిర్మాణ పనులు కూడా చేశారు. కానీ కాంట్రాక్టర్, అధికారులు నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం చేయడంతో నిధులు వెనక్కు వెళ్లిపోయాయి. దీంతో రైతుల పలుమార్లు వినతి మేరకు 2000 సంవత్సరంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పీసువాగు వద్ద చెక్ డ్యామ్ నిర్మాణం చేయించారు. కానీ అది సాగునీటికి సరిపోక పంటలకు నీరందే పరిస్థితి లేదు. దీంతో రైతుల పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. వర్షాధారంతోనే పంటలు సాగుచేస్తున్నారు. ఒక్కో ఏడాది వర్షాలు కురవకపోతే చుట్టు పక్కల సాగు భూములన్నీ బీళ్లుగానే మిగిలిపోతున్నాయి.

వెయ్యి ఎకరాల ఆయకట్టు...

పీసువాగుపై ప్రాజెక్టు నిర్మాణం పునరుద్ధరిస్తే మల్లారం, నర్సింహాసాగర్, లక్ష్మీదేవిపల్లి, బంజర, గుండ్లమడుగు గ్రామాల పరిధిలోని దాదాపు వెయ్యి ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. రైతులు రెండు పంటలు పండించుకోనే అవకాశం ఉంటుంది. ఆదిలోనే నిలిచిపోయిన పీసువాగుపై ప్రాజెక్టు పనులను పునరుద్ధరించాలని రైతులు, స్థానిక నాయకులు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకుంటున్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోవడం లేదు. దీంతో పక్కనే వాగు ఉన్నా పంట భూములకు నీరు అందక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



పీసువాగుపై నిర్మించిన చెక్ డ్యామ్

వర్షపు నీరు వృథాగా పోతోంది



పీసువాగు ప్రాజెక్టు నిర్మాణం జరిగితే వందల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అనేక సార్లు అధికారులకు సమస్యను విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తే గిరిజన రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. అడవిలో ఎగువ నుంచి వచ్చే వర్షం నీరు వృథాగా పోతోంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– ఈసం శ్రీనివాస్, సర్పంచ్, మల్లారం

ఐటీడీఏ అధికారులు స్పందించాలి



సాగునీటి సౌకర్యం లేక ప్రతి సంవత్సరం రైతులు వర్షాధారంపై అరకొర పంటలతో అప్పులపాలవుతున్నారు. ఏళ్ల క్రితం పీసువాగు ప్రాజెక్టును మంజూరు చేసి పనులు ప్రారంభించిన ఐటీడీఏ పీఓ స్పందించి పనులు పునరుద్ధరించాలి. ఇది జరిగితే చుట్టుపక్కల వెయ్యి ఎకరాల గిరిజన రైతుల పంటలకు సాగునీరు అందుతుంది.

– ఈసం ఉపేందర్, రైతు

ప్రతిపాదనలు పంపుతాం



పాల్వంచ మండలం మల్లారం గ్రామ సమీపంలోని పీసువాగు ప్రాజెక్టు గతంలో పనులు జరిగిన విషయం తన దృష్టికి రాలేదు. వాగులపై చెక్‌డ్యామ్‌లు నిర్మాణం చేయడం జరుతుంది. పీసువాగును పరిశీలించి పునరుద్ధరణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తా. ప్రాజెక్టును పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– బి.అర్జున్, జలవనరులశాఖ ఈఈ

మున్నూరుకాపుల సంక్షేమానికి కృషి

టేకులపల్లి: తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడి ఉన్న కులాల్లో అత్యధికంగా వెనుకబడి ఉన్నది మున్నూరుకాపులేనని, రాబోయే కాలంలో రాజ్యాధికారం కోసం మున్నూరు కాపులు ఐక్యంగా ముందుకు సాగాలని బేతంపూడి సొసైటీ చైర్మన్, సంఘం నేత లక్కినేని సురేందర్‌రావు, సంఘం మండల అధ్యక్షుడు లక్కినేని వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని లక్కినేని నివాసంలో సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇల్లెందు నియోజకవర్గంలో ఐదు మండలాలు, ఇల్లెందు పట్టణంతో కలిపి మున్నూరు కాపులు 25 – 30 వేల వరకు ఉన్నారని అందరి సంక్షేమానికి సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. మండల ప్రధాన కార్యదర్శి గంగారపు శేషయ్య, నర్సింగ్ లక్ష్మయ్య, గంగారపు కోటేశ్వర్‌రావు, దోర్నాల విజయ్‌మోహన్‌రావు, గంగారపు రమేష్, యాస ప్రసాద్, కదుదుల వీరన్న, నారందాస్ నరసింహారావు, లక్కినేని మురళి, నర్సింగ్ శ్రీనివాస్‌రావు, బండ్ల కృష్ణ, లక్కినేని కృష్ణ, కడుదుల వెంకట రామారావు పాల్గొన్నారు.



మున్నూరుకాపు సంఘం క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రణాళికలు పారదర్శకంగా ఉండాలి

చుంచుపల్లి: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో అవగాహన కలిగి వాటికి పారదర్శకంగా అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని జెడ్పీ చైర్మన్ కనకయ్య సూచించారు. మంగళవారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో సబ్‌కీ యోజన సబ్‌కా వికాస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోరం కనకయ్య వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు కావాల్సిన పనులను గుర్తించి వాటిని పూర్తి చేసేందుకు కావలసిన నిధుల ప్రణాళికలను పక్కాగా తయారు చేయాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు దృష్టి సాధించాలని చెప్పారు. ప్రజా అవసరాలకు ఉపయోగపడే పనులను చేపట్టినప్పుడే గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని వివరించారు. అనంతరం జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు మాట్లాడుతూ.. గ్రామాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. జెడ్పీ సీఈఓ విద్యాలత, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్లు, బస్ షెల్టర్లు నిర్మించండి

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో పబ్లిక్ టాయిలెట్లు, బస్ షెల్టర్ ఏర్పాటు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే నాగుల్‌మీరా అన్నారు. మంగళవారం జూలూరుపాడులో ఏఐవైఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలో సుమారు 40 వేల జనాభా ఉందని, మండల కేంద్రానికి పరిసర గ్రామాల నుంచి వందలాది మంది ప్రజలు పనుల నిమిత్తం వస్తూ పోతుంటారని, పబ్లిక్ టాయిలెట్లు, బస్ షెల్టర్ లేక ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ఈ సమస్యను పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 3న ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పగడాల అఖిల్, కొండా హనుమంత్‌రావు, కిలారి నరేష్, పానుగంటి మహేష్, ఉసికల నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రజావేదిక

పాల్వంచరూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 2న ఉదయం 10 గంటలకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల నిర్వహణపై ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.రవీంద్రప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 36 గ్రామపంచాయతీల్లో ఉపాధి పనులపై తనిఖీ జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

కాంట్రాక్టు కార్మికుల నిరసన

పాల్వంచరూరల్: మిషన్ భగీరథలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో తోగ్గూడెం వద్ద గల మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రం ఎదుట నిరసన దీక్ష చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మిషన్ డీఈ సాయికి వినతిపత్రం అందజేశారు. కంపెనీల యాజమాన్యం, కార్మిక యూనియన్ నాయకులతో జాయింట్ మీటింగ్‌ను ఏర్పాటు చేసి డిమాండ్లను పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.


రిటైర్డ్ హెచ్ఎంకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న వెంకటేశ్వరరావు

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లుకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మద్దిశెట్టి వెంకటేశ్వరరావు స్ఫూర్తి విశిష్ట విద్యాసేవ రత్న జాతీయ పురస్కారం లభించింది. యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనకు పురస్కారం అందజేసి సన్మానించారు.


ఏసీడీ పేరుతో అదనపు భారం తగదు



సూపర్‌బజార్(కొత్తగూడెం): డీఈ కార్యాలయం ఎదుట ప్రజాపంథా ఆధ్వర్యంలో ధర్నా

ఏసీడీ పేరుతో వసూలు చేస్తున్న విద్యుత్ అదనపు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీల ఆధ్వర్యంలో కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో విద్యుత్ సబ్ స్టేషన్ల ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోపిడీ దొంగల్లా ప్రజలను దోచుకుంటున్నారని విమర్శించారు. బకాయిల పేరుతో సామాన్య ప్రజలపై భారం వేస్తున్నాయని ఆరోపించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందురూరల్: ధర్నా చేస్తున్న ప్రజాపంథా కార్యకర్తలు



పాల్వంచ: సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా



ఇల్లెందు: మాట్లాడుతున్న నజీర్ అహ్మద్



జూలూరుపాడు: పాపకొల్లు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న ప్రజాపంథా నాయకులు

అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాం..

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనుల కోసం రూ.100 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఈ నిధులతో అన్నిరంగాల్లో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. పాత పాల్వంచలో తన స్వగృహంలో ఎమ్మెల్యే మంగళవారం విలేకరులతో మాట్లాడారు. డీఎంఎఫ్‌టీ నిధులు రూ.60 కోట్లు, స్పెషల్ ఫండ్ ద్వారా రూ.40కోట్ల నిధులు మంజూరు కాగా, రోడ్లు, డ్రెయిన్లు, పార్కులు, లైటింగ్, కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తామని తెలిపారు. కొత్తగూడెం–పాల్వంచ జంట పట్టణాలుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చెప్పారు. ప్రజల ఆశీస్సులతో ఇంత అభివృద్ధి చేయగలుగుతున్నానని ఆయన వెల్లడించారు.

షాదీముబారక్ చెక్కుల పంపిణీ..

నియోజకవర్గంలోని 75మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు రూ.75 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఆర్ఐలు ఎస్.బిక్షమయ్య, హచ్చా, యూసఫ్ అలీ, సొసైటీ వైస్ చైర్మెన్ కాంపెల్లి కనకేశ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుతో పాటు నాయకులు ఎస్‌వీఆర్‌కే.ఆచార్యులు, చింతా నాగరాజు, దాసరి నాగేశ్వరరావు, కాల్వ ప్రకాష్‌రావు, బండి చిన్న వెంకటేశ్వర్లు, అన్వర్, మల్లెల శ్రీరామ్మూర్తి, బేతంశెట్టి విజయ్, చిన్న వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సోమయ్య, కేసుపాక వెంకటేశ్వర్లు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

ఎమ్మెల్యే గారూ.. చొరవ చూపండి



ఎమ్మెల్యే హరిప్రియకు వినతిపత్రం అందజేస్తున్న హాస్టల్ వర్కర్లు

ఇల్లెందు: గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని హాస్టల్, పీఎంహెచ్‌లో పని చేస్తున్న వర్కర్ల సమస్య పరిష్కారం కోసం చొరవ చూపాలని ఎమ్మెల్యే హరిప్రియను వర్కర్లు వేడుకున్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్ఏ నబీ మాట్లాడుతూ.. డైలీవేజ్ వర్కర్లకు 8 నెలల వేతనాలు, అవుట్ సోర్సింగ్ వర్కర్‌లకు 22 నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్కర్లు పద్మ, ముత్తయ్య, తాళ్లూరి కృష్ణ, ఈసం పద్మ, జయా, అంజమ్మ, సుబ్రమణ్యం, సమ్మక్క, సుగుణ, సుశీల, లక్ష్మి, రాజమ్మ, రమ, రజిత, రమణి, జానకి, లక్ష్మణ్‌పాసీ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్లు, వర్కర్లకు 2018 నుంచి పెంచిన వేతనాలు అందజేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు అబ్దుల్‌నబీ ఎమ్మెల్యే హరిప్రియకు వినతిపత్రం అందజేశారు.

కల సాకారం...

ఇల్లెందురూరల్: మాణిక్యారం గ్రామపంచాయతీ ఒంపుగూడెం గ్రామస్తులకు సరైన రహదారి సౌకర్యం లేక దశాబ్దాలుగా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమయంలోనూ ఎన్నికల ప్రచారాన్ని సైతం అడ్డుకొని తమ రోడ్డు మాటేంటని ప్రజాప్రతినిధులను నిలదీశారు. నాడు ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ రూ.1.80 కోట్ల వ్యయంతో డీఎంఎఫ్ నిధుల నుంచి మాణిక్యారం గ్రామం నుంచి ఒంపుగూడెం మీదుగా పాఖాల ఆర్అండ్‌బీ రోడ్డు వరకు బీటీ రోడ్డు మంజూరు చేయించారు. మాణిక్యారం గ్రామపంచాయతీ సర్పంచ్ మోకాళ్ల కృష్ణ మంగళవారం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ముత్తారపుకట్ట సర్పంచ్ మంకిడి కృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, ఎంపీటీసీ బానోత్ రోజా, ఆర్అండ్‌బీ ఏఈ మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్టూ మహాసభను జయప్రదం చేయండి

టేకులపల్లి: ఫిబ్రవరి 5న నిజామాబాద్ జక్రాన్‌పల్లిలో జరిగే తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) రాష్ట్ర పథమ మహాసభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి పిలుపునిచ్చారు. మంగళవారం తొమ్మిదో మైలుతండా, బేతంపూడి గ్రామ పంచాయతీల్లో కరపత్రాలు ఆవిష్కరించి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సామేల్, లాలి, అమ్మి, సంతు, రాందాస్,మంగీలాల్, సమ్మక్క, సునీత, కళావతి, గోపా, రామస్వామి, లక్ష్మయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో పలువురికి వీడ్కోలు సన్మానం



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న సింగరేణి ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం)/పాల్వంచ: సింగరేణి సంస్థలో 39ఏళ్ల వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేస్తున్న డైరెక్టర్ (ఓపీ అండ్ పా) ఎస్.చంద్రశేఖర్‌ను మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్(ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా పాల్గొనగా వక్తలు మాట్లాడుతూ.. చంద్రశేఖర్ ఎంతో నిబద్ధతతో విధులు నిర్వర్తించారని కొనియాడారు. సింగరేణి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జీఎంలు, అధికారులు, అసోసియేషన్ బాధ్యులు అందెల ఆనందరావు, కట్టా కుసవయ్య, వెంకటేశ్వర్లు, వైజీకే.మూర్తి, బీ.వీ.రావు, దామోదర్‌రావు, గోనె శ్రీకాంత్, కనకయ్య, కలవలం చంద్రశేఖర్, మాల కొండయ్య, మోరే రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఉద్యోగ విరమణ చేస్తున్న డైరెక్టర్ చంద్రశేఖర్‌కు కేటీపీఎస్ అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేటీపీఎస్ ఏడో దశ కోల్ ప్లాంట్ ఎస్ఈ గుర్రం రాజ్‌కుమార్‌తో పాటు అధికారులు ఎస్ఎన్ఎస్.శేఖర్, ఎం.బలరాం, వై.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డీజీఎం పర్సనల్ శ్రీనివాస్‌కు..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయం హెచ్ఆర్డీ విభాగంలో డీవై జీఎం పర్సనల్ మంచాల శ్రీనివాస్ ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా హెచ్ఆర్డీ విభాగం అధికారులు, ఉద్యోగులు మంగళవారం కార్పొరేట్ కాన్ఫరెన్స్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. హెచ్ఆర్డీ జీఎం బీహెచ్ వెంకటేశ్వరరావు, రఘుకుమార్, రామ్మోహన్, ఎంఆర్‌జీ కే.మూర్తి, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: ఉద్యోగులు కిందిస్థాయి ఉద్యోగులతో పాటు వివిధ వర్గాల ప్రజల నుంచి అందుకున్న మన్ననలే చిరస్థాయిగా నిలిచిపోతాయని ఏరియా జీఎం షాలేమురాజు అన్నారు. మంగళవారం ఇల్లెందులోని జీఎం కార్యాయలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 41 ఏళ్ల పాటు సింగరేణి వివిధ హోదాల్లో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన దర్శనాల నరసింహారావును ఘనంగా సత్కరించారు. ఎస్ఓటూ జీఎం మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసు, అధికారులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

రహదారిపై హై‘టెన్షన్’..

పర్యాటక ప్రాంతమైన కిన్నెరసాని వెళ్లే ప్రధాన రహదారిపై హైటెన్షన్ విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతుండటంతో వాహనదారులు, పాదచారులు భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. కరవాగు బంజర గ్రామ శివారులో కేటీపీఎస్ నుంచి మిర్యాలగూడెం వైపు వెళ్లే హైటెన్షన్ విద్యుత్ లైన్ ప్రధాన రహదారిపై కిందకు వేలాడుతోంది. ఈ రహదారిపై టూరిస్టు బస్సులు, పునుకుల గ్రామ శివారులోని కేటీపీఎస్ బూడిద చెరువు నుంచి సిమెంట్ ఫ్యాక్టరీలకు రేయింబగవళ్లు ట్యాంకర్లు, లారీలు ఓవర్‌లోడుతో వెళుతుంటాయి. వచ్చేది వేసవికాలం గాలిదుమారాలు అధికంగా ఉంటాయి. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. – పాల్వంచరూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : కె.స్వామి, ట్రాన్స్‌కో డీఈ
సెల్ నంబర్ : 9490177218